దారులు.. దారుణం!!



● బజార్‌హత్నూర్ మండలం డెడ్రా, గిరిజాయి గ్రామాలకు వెళ్లే రోడ్డు మార్గం కంకరతేలి ఇలా..



● అధ్వానంగా మారిన భీంపూర్ మండలంలోని తాంసి(కె) రోడ్డు



● బీర్సాయిపేట రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని రోడెక్కిన గ్రామస్థులు (ఫైల్)

అధ్వానపు.. దారులు!

- జిల్లాలో అతుకులబొంతగా గ్రామీణ రోడ్లు
- సంవత్సరాల తరబడి మరమ్మతులకు నోచుకోని వైనం
- అడుగడుగునా గుంతలు.. ప్రయాణికులు, వాహనదారులకు తప్పని తిప్పలు
- పలు గ్రామాలలో ఏడాదికే నాణ్యత తారుమారవుతున్న వైనం
- మూన్నాళ్ల ముచ్చటగా మారుతున్న రోడ్లు, కల్వర్టుల నిర్మాణ పనులు
- సత్వరమే పనులు చేపట్టాలంటూ రోడ్డెక్కుతున్న గ్రామస్థులు
- బిల్లులు రాక చేతులెత్తేస్తున్న కాంట్రాక్టర్లు
- నూతన కాంగ్రెస్ ప్రభుత్వంపై భారీ ఆశలు
- జిల్లావ్యాప్తంగా 18 మండలాల పరిధిలో ఇవే పరిస్థితులు!!



ఆదిలాబాద్, ఫిబ్రవరి 19(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఏళ్ల తరబడి రోడ్ల మరమ్మతులను చేపట్టక పోవడంతో గ్రామీణ రోడ్లన్నీ అధ్వానంగా కనిపిస్తున్నాయి. దీంతో ప్రయాణికులు పడరాని పాట్లు పడుతూ ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఏడాదిలోనే రోడ్ల నాణ్యత తారుమారవుతూ నాణ్యత నగుబాటుగా మారుతుంది. జిల్లాలో రోడ్డు భవనాల శాఖ, పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో రోడ్లు, కల్వర్టుల నిర్మాణ పనులను చేపడుతున్నా.. మూన్నాళ్ల ముచ్చటగానే మారింది. గతేడు వేసవిలో రోడ్ల మరమ్మతులకు గాను రూ.40 కోట్లు, వర్షాలు, వరదల కారణంగా ధ్వంసమైన రోడ్ల మరమ్మతులకు రూ.92కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. కానీ ఇప్పటి వరకు రూ.16కోట్ల విలువైన పనులు మాత్ర మే పూర్తయినట్లు అధికారులు పేర్కొంటున్నారు. ఈ నిధులు కూడా పెండింగ్‌లో ఉండడంతో సంబంధిత కాంట్రాక్టర్లు అర్ధాంతరంగానే పనులను నిలిపివేశారు. మరికొన్ని పనులు అగ్రిమెంట్ దశలోనే కనిపిస్తున్నాయి. జిల్లాలోని 18 మండలాల పరిధిలో ఇవే పరిస్థితులు కనిపిస్తున్నాయి. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పనులు చేపట్టక పోవడంతో గత్యంతరం లేక గ్రామస్థులు రోడ్డెక్కుతున్నారు. ఇటీవల ఉట్నూర్ మండలం బీర్సాయిపేట్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ఆ గ్రామస్థులు రోడ్డుపై ధర్నా చేపట్టారు. ఇలా జిల్లాలో చాలా గ్రామాల ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. అయితే వేసిన రోడ్లనే పదేపదే వేస్తూ నిధుల దుర్వినియోగం చేస్తున్నారన్న ఆరోపణలు కూడా లేక పోలేదు. గతేడు జిల్లాలో భారీ వర్షాలు కురవడంతో రోడ్లన్నీ ధ్వంసమై పోయా యి. ఇప్పటి వరకు కొన్ని రోడ్లకు మాత్రమే తాత్కాలికంగా మరమ్మతులు చేపట్టి మిగితా రోడ్లను వదిలేశారు. మరమ్మతులు చేపట్టేందుకు వేసవి కాలం అనుకూలమైనప్పటికీ.. ఎక్కడా కూడా మరమ్మతులు చేపట్టిన దాఖలాలు కనిపించడం లేదు. వర్షాకాలం సమీపిస్తే చాలా గ్రామాల ప్రజలకు ఇబ్బందులు తప్పవంటున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అక్కడక్కడ మరమ్మతులు చేపట్టినా.. మళ్లీ పరిస్థితి మొదటికే రావడంతో కొత్త ప్రభుత్వంపైన భారీ ఆశలు పెట్టుకుంటున్నారు.

తప్పుడు నివేదికలు

రోడ్ల నిర్మాణ పనులు నాణ్యతగానే ఉన్నాయంటూ సంబంధిత శాఖ అధికారులు క్యూసీ రిపోర్టులను ఇస్తున్నా.. యేడాది గడవక ముందే కంకరతేలి అధ్వానంగా మారడం ఏమిటనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. పనుల పట్ల అధికారులు నికచ్చిగా వ్యవహరించక పోవడంతోనే ఇలాంటి పరిస్థితులకు దారి తీస్తోందన్న అభిప్రాయాలు లేకపోలేదు. రోడ్డు నిర్మాణం పూర్తయ్యే వరకు వివిధ దశల్లో నాణ్యతా ప్రమాణాలను పాటించే విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉండగా.. అధికారులు మాత్రం అటువైపు కన్నెత్తయినా చూడడం లేదంటున్నారు. పనులు పూర్తయిన తర్వాతనే నామమాత్రంగా క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేసి శాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం ల్యాబ్‌లకు పంపుతున్నారు. ఒకవేళ నాణ్యత లేదని తెలిసినా.. ఆ వెంటనే గుట్టు చప్పుడుకాకుండా కాంట్రాక్టర్లు అధికారులను మేనేజ్ చేస్తున్నారు. నాణ్యత లేకుండా పనులు చేపట్టినట్లయితే సదరు కాంట్రాక్టర్‌పై శాఖపరమైన చర్యలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ ఏ ఒక్క కాంట్రాక్టర్ నుంచి రికవరీ చేసిన దాఖలాలు లేవు. అంతేకాకుండా ఒకవేళ పనులు చేసినా.. నామమాత్రంగానే కనిపిస్తోంది. ఇదంతా అధికారుల కనుసన్నల్లోనే కొనసాగుతున్నా.. పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. యేటా కోట్ల రూపాయల నిధులు నేలపాలవుతున్నా.. నాణ్యతా ప్రమాణాలను మాత్రం పట్టించుకోవడం లేదంటున్నారు.

ముందస్తు చర్యలు కరువు

పది కాలాల పాటు పదిలంగా ఉండాల్సిన రోడ్ల నిర్మాణ పనులు.. మూన్నాళ్ల ముచ్చటగా మారుతున్నాయి. అడుగడుగునా అధికారుల నిర్లక్ష్యమే కనిపిస్తోంది. చిన్నపాటి జాగ్రత్తలు తీసుకుంటే రోడ్ల నాణ్యతను కాపాడుకునే అవకాశం ఉంటుంది. జిల్లాలో ఎక్కువగా నల్లరేగడి నేలలే కావడంతో రోడ్ల నాణ్యతా ప్రశ్నార్థకంగా మారింది. దీంతో చిన్నపాటి వర్షాలకే రోడ్లన్నీ గుంతలు పడి ప్రమాదకరంగా మారుతున్నాయి. రోడ్డు పైనుంచి వర్షపు నీటిని తొలగించే విధంగా జాగ్రత్తలు తీసుకోవాలి. కానీ, ఎక్కడా గ్యాంగ్‌మెన్లు క్షేత్రస్థాయిలో విధులు నిర్వహిస్తున్న పరిస్థితులు కనిపించడం లేదు. కేవలం కార్యాలయాలకే పరిమితం కావడంతో రోడ్ల మరమ్మతులను పట్టించుకునే నాథుడే కనిపించడం లేదు. వెంటనే చిన్నపాటి మరమ్మతులను చేపట్టి ఉంటే.. పెద్దగా ఇబ్బందులు ఉండవంటున్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ తారురోడ్లపై కేజ్‌వీల్ వాహనాలు, పరిమితికి మించిన భారీ వాహనాలను నడపకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. యేటా గుంతలు పడిన రోడ్లకు మరమ్మతులు చేపట్టడం, అందినకాడికి దండుకుని జేబులో వేసుకోవడం అధికారులకు అలవాటుగా మారిందంటున్నారు. జిల్లాలో ఏఒక్క రోడ్డు పదేళ్ల పాటు నాణ్యతగా ఉన్న దాఖలాలు ఎక్కడా కనిపించడం లేదంటున్నారు. అలాగే రోడ్లకు ఇరువైపులా పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు పెరిగిపోయి ప్రమాదకరంగా మారినా.. తొలగించే ప్రయత్నం కూడా చేయడం లేదు. దీంతో మలుపుల వద్ద ప్రమాదాలు జరిగి ఎన్నో ప్రాణాలు గాలిలో కలుస్తున్నాయి.

త్వరలోనే నిధులు మంజూరవుతాయి

: మహవీర్, పంచాయతీరాజ్ శాఖ ఈఈ, ఆదిలాబాద్



జిల్లాలో రోడ్ల మరమ్మతులకు గాను త్వరలోనే ప్రభుత్వం నిధులు మంజూరు చేసే అవకాశం ఉంది. ఈనెల చివరి వరకు నిధులు విడుదలవుతాయి. వెంటనే మరమ్మతులను చేపట్టడం జరుగుతుంది. అయితే, గతంలో మంజూరైన నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ కారణంగా పనులు అనుకున్నంత స్థాయిలో ముందుకు సాగడం లేదు. ఇప్పటికే కొన్ని పనులకు గాను టెండర్లను కూడా పూర్తి చేశాం. వేసవిలో రోడ్ల మరమ్మతు పనులన్నీ పూర్తి చేస్తాం.



అర్జీదారుల నుంచి ఫిర్యాదులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్

అర్జిదారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలి : అదనపు కలెక్టర్

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 19: సంబంధిత అధికారులు అర్జిదారుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్యామల దేవి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో అర్జీదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వివిధ మండలాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించి పరిష్కరంచాలని సంబంధిత శాఖల అధికారులకు అందించారు. అధికారులపై నమ్మకంతో ఇచ్చే అర్జీలపై నిర్లక్ష్యం చే యకుండా పరిష్కార మార్గాలను అన్వేశించాలని సూచించారు. ఇందులో డీఆర్‌వో రమేష్ రాథోడ్, ఆర్డీవో స్రవంతి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

● 'పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి'

ఆదిలాబాద్ అర్బన్: పదవ తరగతి, ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సందర్భంగా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ శ్యామలదేవి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో ఏర్పాటు చేసిన పరీక్షల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 28 నుంచి మార్చి 19వ తేదీ వరకు ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రతీ రోజు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరుగుతాయన్నారు. మొత్తం పరీక్షలు కేంద్రాలు 30 ఏర్పాటు చేయడం జరిగిందని, మొదటి సంవత్సరం విద్యార్థులు 11666, ద్వితీయ 9861, మొత్తం 21527 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. అలాగే పదవ తరగతి వార్షిక పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 1వరకు ప్రతీరోజు ఉదయం 9.30గంటల నుంచి మధ్యాహ్నం 12.30గంటల వరకు కొనసాగుతాయని పేర్కొన్నారు. పదవ తరగత పరీక్ష కేంద్రాలు 53 ఏర్పాటు చేశామని, 10507 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని తెలిపారు. అలాగే, పరీక్ష కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్‌లను మూసి వేయించాలని, 144 సెక్షన్ అమలు చేయాలని, తగిన సంఖ్యలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. ఇందులో ఆయా శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అలాగే, తెలంగాణ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం 2024 డైరీని అదనపు కలెక్టర్ శ్యామలదేవి సోమవారం ఆవిష్కరించారు. ఇందులో జిల్లా అధ్యక్షుడు సంద అశోక్, ప్రధాన కార్యదర్శి నవీన్‌కుమార్ ఉన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లావ్యాప్తంగా ఛత్రపతి శివాజీ మహరాజ్ 394వ జయంతి వేడుకలను సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా ఆదిలాబాద్ జిల్లాకేంద్రంలోని శివాజీ చౌక్‌లో నిర్వహించిన వేడుకల్లో ఎమ్మెల్యే పాయల శంకర్, ఉట్నూర్‌లో జడ్పీ ఛైర్మన్ రాథోడ్‌జనార్ధన్‌లు పాల్గొనగా.. రణదివ్య నగర్‌లో మాజీ మంత్రి జోగు రామన్న శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అలాగే, నిర్మల్ జిల్లాకేంద్రంలో ఎమ్మెల్యే, బీజేఎల్పీ నాయకుడు ఏలేటి మహేశ్వర్ రెడ్డి శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో బీజేపీ నాయకులు, హిందూ వాహిణి, భజరంగ్‌దళ్, పెద్దసంఖ్యలో యువకులు పాల్గొన్నారు.

(- ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్, నిర్మల్ న్యూస్ నెట్‌వర్క్)



శివాజీ విగ్రహానికి పూలమాల వేస్తున్న ఎమ్మెల్యే ఆదిలాబాద్ శంకర్



భైంసాలో జయంతి వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పాటిల్

అండర్‌బ్రిడ్జి పనులు కొనసాగించాలి'

● గంటకు పైగా ఆందోళన.. నిలిచిన రాకపోకలు

ఆదిలాబాద్ అర్బన్, ఫిబ్రవరి 19: తాంసి బస్టాండ్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జిలను కొనసాగించాలని డిమాండ్ చేస్తూ తాటిగూడ, భాగ్యనగర్, ఖుర్షిద్‌నగర్, వడ్డెర కాలనీ, ఉస్మానియానగర్ కాలనీ వాసులు ఆందోళన చేపట్టారు. సోమవారం పంజాబ్‌చౌక్‌లో రాస్తారోకో నిర్వహించి నిరసన తెలిపారు. దాదాపు రాస్తారోకో గంటకు పైగా సాగడంతో వాహనాలు ఇరువైపుల పెద్దఎత్తున నిలిచి పోయాయి. విషయం తెలుసుకున్న వన్ టౌన్, టూ టౌన్ సీఐలు అశోక్, సత్యనారాయణలు కాలనీవాసులతో మాట్లాడారు. అనంతరం డీఎస్పీ జీవన్‌రెడ్డితో పాటు ఎమ్మెల్యే పాయల శంకర్ అక్కడికి చేరుకుని వారితో మాట్లాడి ఆందోళన విరమింప చేశారు.

'నిర్లక్ష్యం వద్దు కూలీల సంఖ్య పెంచండి'

తలమడుగు, ఫిబ్రవరి 19: వేసవి కాలంలో గ్రామీణ కూలీలకు ఉపాధి కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో కూలీలకు పని కల్పించడంలో సిబ్బంది నిర్లక్ష్యం వహించకుండా కూలీల సంఖ్య పెంచేందుకు కృషి చేయాలని ఉపాధి హామీ ఏపీడీ కుటుంబరావు కోరారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం

మావల, ఫిబ్రవరి 19: జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక యువకుడు దుర్మణం చెందాడు. మావల ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం.. జైనథ్ గ్రామానికి చెందిన చౌదరి రవీందర్ చౌహన్ అజయ్, సమాద్‌లు ఒకే ద్విచక్ర వాహనంపై ఆదిలాబాద్ వైపు వస్తున్నారు. ఈ క్రమంలో మావల హరితవనం దగ్గర వెనుక నుంచి ఓ కారు వేగంగా వచ్చి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో చౌదరి రవీందర్ అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన క్షతగాత్రులను స్థానికులు రిమ్స్ తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

● ద్విచక్ర వాహనం అదుపుతప్పి మరొకరు..

బోథ్, ఫిబ్రవరి 19: సోనాల మండలంలోని నాగుగూడ గ్రామం సమీపంలో ద్విచక్ర వాహనం సోమవారం అదుపుతప్పి కింద పడటంతో ద్విచక్ర వాహనంపై వెళుతున్న బజార్హత్నూర్ మండల కేంద్రానికి చెందిన పైడిపల్లి సాయికృష్ణ(35) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి తండ్రి గంగాధర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్సై బి.రాము తెలిపారు. కాగా మృతుడు మహారాష్ట్రలో చికిలి గ్రామంలో బంధువును దింపి వేసి వస్తుండగా ప్రమాదానికి గురైనట్లు తెలిసింది.



అర్జీలను స్వీకరిస్తున్న పీవో ఖుష్బుగుప్తా

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

● గిరిజన దర్బార్‌లో ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో

ఉట్నూర్, ఫిబ్రవరి 19: ఉమ్మడి జిల్లాలోని గిరిజనుల సమస్యల పరిష్కారానికి త్వరితగతిన చర్యలు చేపట్టాలని ఐటీడీఏ ఇన్‌చార్జి ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తా అధికారులను ఆదేశించారు. సోమవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన గిరి జన దర్బార్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యల అర్జీలను ఆమె స్వీకరించారు. పింఛన్, రెండు పడక గదుల ఇళ్లు, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని గిరిజనులు దరఖాస్తులు సమర్పించారు. సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని పీవో అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో జనరల్ కినక భీంరావు, ఈఈ రాథోడ్ భీంరావు, ఏవో రాంబాబు, ఆర్‌సీవో గంగాధర్, బీఎడ్ కళాశాల ప్రిన్సిపాల్ మెస్రం మనోహర్, డీపీవో ప్రవీణ్, మేనేజర్ లింగు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో అఖిలపక్షం ఆందోళన

● అలేఖ్య హత్య కేసులో వెంటనే ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని డిమాండ్

ఖానాపూర్, ఫిబ్రవరి 19: నిర్మల్ జిల్లా ఖానాపూర్‌లో ఇటీవల హత్యకు గురైన అలేఖ్య కేసులో హంతకుడితో పాటు అతనికి సహకరించిన వారికి వెంటనే ఉరిశిక్ష వేయాలంటూ అఖిలపక్షం ఆధ్వర్యంలో సోమవారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య ఆధ్వర్యంలో అఖిల పక్షం నాయకులు నిర్మల్ - ఖానాపూర్ రహదారిపై రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా అఖిల పక్షం నాయకులు మాట్లాడుతూ.. నడిరోడ్డుపై ఒక యువతిని హత్య చేయడం అత్యంత దారుణమైన ఘటన అన్నారు. అలేఖ్య కుటుంబానికి న్యాయం జరగాలంటే ఈ హత్య కేసు విచారణ కోసం వెంటనే ఫాస్ట్ ట్రాక్ కోర్టును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేవలం హంతకుడు అతని తల్లి, తమ్ముడి అరెస్టుతోనే సరిపెట్టకుండా కాల్ డేటా ఆధారంగా హంతకుడు జూకింది శ్రీకాంత్‌కి సహకరించిన వారందరినీ గుర్తించి వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

నిర్మల్ పట్టణ అభివృద్ధికి కృషి : ఏలేటి

నిర్మల్ చైన్‌గేట్, ఫిబ్రవరి 19: నిర్మల్ పట్టణ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం నిర్మల్ పట్టణంలోని నాయుడువాడ కాలనీలో కేంద్ర ప్రభుత్వ నిధుల కింద మంజూరైన రూ.8 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... రానున్న రోజుల్లో కేంద్ర ప్రభుత్వ నిధులతో పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ సాధం స్వప్న అరవింద్, మున్సిపల్ కమిషనర్‌తో పాటు బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి

● విద్యారంగానికి ప్రాధాన్యం

నిర్మల్ కల్చరల్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం నుంచి మంజూరయ్యే నిధుల్లో విద్యారంగానికి ప్రాధాన్యమిచ్చి అభివృద్ధి చేస్తానని ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి అన్నారు. సోమవారం జుమ్మేరాత్‌పేట్ స్కూల్‌లో ప్రధాన మంత్రి స్కూల్ రైసింగ్ ఇండియా పథకంలో భాగంగా రూ. 40.50 లక్షల నిధులతో నిర్మించనున్న అదనపు గదుల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో జిల్లా నుంచి తరలివెళ్లిన విద్యాసంస్థలను తిరిగి రప్పిస్తానన్నారు. అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మహేశ్వర్ రెడ్డిని ఉపాధ్యాయులు శాలువాతో సన్మానించారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన కడ్తాల్ విద్యార్థులు

డ్రామా పోటీలు విద్యార్థుల్లోని సృజనాత్మకత వెలికితీస్తాయి : కమిషనర్

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 19: పాఠశాల విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకత డ్రామా పోటీలు వెలికితీస్తాయని పరీక్షల సహాయ కమిషనర్ పద్మ అన్నారు. ఎల్టా ఆధ్వర్యంలో సోమవారం సోఫీనగర్ కస్తూర్బా విద్యాలయంలో డ్రామా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మాట్లాడారు. కడ్తాల్ ఉన్నత పాఠశాల, మంచిర్యాల కేజీబీవీ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఇందులో ఎల్టా అధ్యక్షుడు కడార్ల రవీంద్ర, ప్రధాన కార్యదర్శి భూమన్న యాదవ్, వేణుగోపాల్, రతన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి అల్లోలకు ఫోన్‌లో కేసీఆర్ పరామర్శ


నిర్మల్ రూరల్, ఫిబ్రవరి 19: మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి సోదరుడు అల్లోల హన్మంత్‌రెడ్డి హృతి పట్ల మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు, ఎంపీ సంతోష్ కుమార్ సంతాపం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డికి ఫోన్ చేసి పరామర్శించారు. హన్మంత్ రెడ్డి ఆత్మకు సద్గతులు కలగాలని కోరారు. కాగా అంత్యక్రియలకు బీజేఎల్‌పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్, ఎమ్మెల్సీ దండే విఠల్, మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న, కోనేరు కోనప్ప, దివాకర్ రావు, జడ్పీ మాజీ ఛైర్ పర్సన్ శోభా సత్యనారాయణ గౌడ్, నిర్మల్ జడ్పీ ఛైర్ పర్సన్ విజయలక్ష్మి రామ్‌కిషన్ రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ ఈశ్వర్, ఆదిలాబాద్ డీసీసీబీ ఛైర్మన్ అడ్డి భూజారెడ్డి, మాజీ ఛైర్మన్ దామోదర్ రెడ్డి హాజరయ్యారు. ఇంద్రకరణ్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు.



నివాళ్లర్పిస్తున్న బీజేఎల్‌పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి



అంతిమయాత్రలో పాల్గొన్న ప్రముఖులు, ప్రజలు



ఘనంగా శెట్‌పల్లి లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణం

పెంబి, ఫిబ్రవరి 19 : మండలంలోని శెట్‌పల్లి శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి కల్యాణం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. ఉదయం నుంచి వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఈ ఉత్సవంలో అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం గన్నారపు ప్రమోద్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు గన్నారపు సురేష్, నల్ల పెద్ద రామేశ్వర్ రెడ్డి, పుప్పాల నర్సయ్య, పుప్పాల శంకర్, ఏ. సుధాకర్, టి. నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సదర్మాట్‌పై చిగురిస్తున్న ఆశలు



- సదర్మాట్ ప్రత్యేక కెనాల్ నిర్మాణంపై ఎట్టకేలకు రైతుల్లో చిగురిస్తున్న ఆశలు
- 2017లో ఏడు కిలో మీటర్ల ఎగువన బ్యారేజీ నిర్మాణ పనులు ప్రారంభం
- ఏడేళ్లుగా ఖానాపూర్, కడెం ప్రాంత రైతుల్లో ఎన్నో సందేహాలు
- ఇన్నాళ్లు ఎన్నికల హామీగానే మిగిలిన సదర్మాట్ ప్రత్యేక కెనాల్
- ఈ వేసవిలో ఏడు కిలో మీటర్ల ప్రత్యేక కాలువ నిర్మాణంపై సర్వేకు సర్కారు సన్నద్ధం
- ఇప్పటికే అధికారుల నుంచి వివరాలను సేకరించిన ఖానాపూర్ ఎమ్మెల్యే
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి సదర్మాట్ ప్రత్యేక కెనాల్ అంశాన్ని తీసుకెళ్లిన బొజ్జు
- ప్రత్యేక కెనాల్ నిర్మిస్తేనే సదర్మాట్‌కు గత వైభవం వస్తుందంటున్న రైతులు

(ఖానాపూర్, ఫిబ్రవరి 19)

జిల్లాలోని ఖానాపూర్, కడెం మండలాల రైతులకు వరప్రదాయిని అయిన సదర్మాట్ ప్రత్యేక కాలువ నిర్మాణంపై ఎట్టకేలకు ఈ ప్రాంత రైతుల్లో ఏడేళ్ల తర్వాత ఆశలు చిగురిస్తున్నాయి. 2017లో అప్పటి అముఖ్యమంత్రి కేసీఆర్ సదర్మాట్ బ్యారేజీ నిర్మాణానికి రూ. 516 కోట్లు మంజూరు చేశారు. అయితే బ్యారేజీ ఉన్న ఖానాపూర్ శివారులోని సదర్మాట్ ఆనకట్ట వద్ద కాకుండా దానికి ఏడు కిలో మీటర్ల ఎగువన ఉన్న నిర్మల్ నియోజకవర్గం లోని మామడ మండలం పొన్కల్ వద్ద బ్యారేజీ నిర్మాణం చేప ట్టారు. దీంతో ఖానాపూర్ నియోజకవర్గ రైతులు ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆందోళనలు చేశారు. ఇలా చేయడం వల్ల బ్యారేజీ నుంచి సాగునీరు తమకు రాకుండా నేరుగా మూడు కిలో మీటర్ల దూరంలో ఉన్న జగిత్యాల జిల్లాకు వెళ్తుందని మండిపడ్డారు. ఇలా అయితే తమకు నీరురాక పంటలు పూర్తిస్థాయిలో ఎండుతాయని సంవత్సరం పాటు ఆందోళనలతో హోరెత్తించారు. దీంతో దిగొచ్చిన అప్పటి రాష్ట్ర ప్రభుత్వం పొన్కల్ బ్యారేజీ నుంచి సదర్మాట్ ఆనకట్ట వరకు ఏడు కిలోమీటర్ల మేర ప్రత్యేక కాలువ నిర్మాణం చేపట్టి రైతులకు మొదటి ప్రాధాన్యతగా సాగునీరు అందిస్తామని ప్రకటించింది. కానీ ఏడేళ్లు గడుస్తున్నా.. ఇప్పటికీ ప్రత్యేక కాలువ పనులు ప్రారంభం కాలేదు. 2017 నుంచి ఇప్పటివరకు గత ఏడేళ్ల కాలంలో సదర్మా ట్ ప్రత్యేక కెనాల్ నిర్మాణంపై ప్రభుత్వం నుండి ప్రకటన వస్తుం దేమోనని ఎదురుచూసిన ఈ ప్రాంత అన్నదాతలకు నిరీక్షణ తప్ప మరేమీ మిగల్లేదు. దీంతో ఈ ప్రాంత రైతులు అప్పటి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఖానాపూర్ నియోజకవర్గం లో 2023 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పట్టం కట్టారు. దీంతో ఖానా పూర్ నుంచి శాసన సభ్యుడిగా ఎన్నికైన వెడ్మ బొజ్జు సదర్మాట్ రైతాంగానికి ఆది నుంచి అండగానే ఉంటుందన్నారు. దీంతో ప్రత్యేక కెనాల్ నిర్మాణంపై ఖానాపూర్ ప్రాంతంలో ఆశలు చిగురిస్తున్నాయని రైతులు చెబుతున్నారు.

సదర్మాట్‌పై ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ

ఖానాపూర్, కడెం ప్రాంతాల రైతులకు జీవనాధారంగా ఉన్న సదర్మాట్‌పై ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఖచ్చితంగా సదర్మాట్ ప్రత్యేక కెనాల్ లాంటి అంశాలను పట్టించుకోకపోవడంతోనే 2023 ఎన్నికల్లో సిట్టింగ్ స్థానాన్ని బీఆర్ఎస్ కోల్పోయిందని రాజకీయ వర్గాలు చెబుతున్న నేపథ్యంలో.. ఎమ్మెల్యే సదర్మాట్ రైతాంగంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. ఎన్నికలు అవగానే యాసంగి పంటకు ఆయకట్టుకు నీటి విడుదల చేసే అంశంపై అధికారులతో విభేదించి తన ప్రాంత రైతుల కోసం ఖచ్చితంగా నీటిని విడుదల చేయాలని బలంగా నిలబడ్డారు. దీంతో సదర్మాట్ ఆనకట్ట వద్దకు మంత్రి సీతక్క రావాల్సిన పరిస్థితి వచ్చింది. ఎమ్మెల్యే ఇచ్చిన హామీ ప్రకారం సదర్మాట్ రైతాంగానికి రెండో పంటకు ఖచ్చితంగా పూర్తిస్థాయిలో నీరందిస్తామని అందుకు కావాల్సిన చర్యలు చేపడతామని మంత్రి సీతక్క హామీ ఇచ్చారు. దీంతో రైతాంగానికి స్థానిక ఎమ్మెల్యేపై విశ్వాసం మరింత పెరిగింది. గత రెండు రోజుల క్రితం బడ్జెట్ సమావేశాల్లో అసెంబ్లీలో జరుగుతున్న చర్చల్లో ప్రసంగించిన వెడ్మ బొజ్జు సదర్మాట్ అంశాన్ని ప్రస్తావించారు. ఇన్నేళ్ల కాలంగా ప్రత్యేక కెనాల్‌పై గత పాలకులు పట్టించుకోలేదని ఖచ్చితంగా సదర్మాట్ ప్రత్యేక కెనాల్ నిర్మాణం చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఒక్కసారిగా ఈ ప్రాంత రైతుల్లో ప్రత్యేక కెనాల్ అంశంపై ఆశలు మళ్లీ చిగురించాయి. ప్రత్యేక కెనాల్ నిర్మాణం జరిగితే ఖానాపూర్, కడెం ప్రాంతంలో వ్యవసాయ భూములన్నీ సస్యశ్యామలమవుతాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

అధికారుల నుంచి వివరాల సేకరణ

సదర్మాట్ ప్రత్యేక కెనాల్ నిర్మాణం అంశంపై ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు ఇదివరకే అధికారుల నుండి ప్రాథమిక అంచనా వివరాలను సేకరించినట్లు తెలిసింది. ఏడు కిలో ుటర్ల మేరకు బ్యారేజీ నుంచి ఆనకట్ట వరకు కెనాల్ నిర్మాణం చేయాలంటే 60 ఎకరాల వరకు భూమి కావాలని అధికారులు ఎమ్మెల్యేకు నివేదికను అందించినట్లు తెలిసింది. కాగా 30 ఎకరాల వరకు భూమి అటవీ శాఖ పరిధిలో ఉందని.. మరో 30 ఎకరాలు వ్యవసాయ భూములు ఉన్నాయని అధికారులు చెబుతున్నారు. 30 ఎకరాల భూమి కొనుగోలు కోసం 2013 భూ సేకరణ చట్టం ప్రకారం సేకరించాల్సి ఉండగా.. మరో 30 ఎకరాలు అటవీ శాఖ అనుమతులు పొందాల్సి ఉంటుందని చెబుతున్నారు. ఏడు కిలో మీటర్ల మేరకు కాలువ నిర్మాణం చేసే దారిలో సుమారు 10 వాగులు, ఒర్రెలు ఉన్నాయని, వాటిపై కల్వర్టుల నిర్మాణం చేయాల్సి ఉంటుందంటున్నారు. ఈ ప్రత్యేక కెనాల్ నిర్మాణం కోసం ప్రస్తుత అంచనా ప్రకారం రూ. 60 కోట్ల వరకు ఖర్చు అవుతుందని ఎమ్మెల్యే బొజ్జుకు అధికారులు వివరాలను అందజేసినట్లు తెలిసింది. సదర్మాట్ ప్రత్యేక కెనాల్ నిర్మాణంపై వివరాలు సేకరించిన ఎమ్మెల్యే ఇటీవల హైదరాబాద్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి సదర్మాట్ కెనాల్ అంశాన్ని ప్రస్తావించినట్లు తెలిసింది. రానున్న వేసవిలో సదర్మాట్ ప్రత్యేక కెనాల్‌పై సర్వే నిర్వహించి రెండేళ్లలో పనులను ప్రారంభిస్తామని ఎమ్మెల్యే చెబుతున్నారు.


ఆనకట్ట గత చరిత్ర ఎంతో ఘనం

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోనే అధికంగా వరిని పండించే ప్రాంతాల్లో ఒకటిగా గతంలో ఖానాపూర్ ప్రత్యేక గుర్తింపు పొందింది. ఇక్కడ పండించిన వరి పంటకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా ఎంతో ఆదరణ ఉండేది. ఆ కాలంలోనే అందరికీ భోజనాన్ని అందించిన ప్రాంతం కాబట్టే ఖానాపూర్‌ను ఆ పేరుతో పిలిచే వారిని ప్రతీతి. ఇక్కడి రైతులకు ఇంతటి గుర్తింపును తెచ్చిన సదర్మాట్ ఆనకట్ట ఈ ప్రాంతానికి జీవనాధారం. అటవీ జంతువులకు తాగునీటికి ఆవాసంగా నిలిచేది. ఈ సదర్మాట్ ఆనకట్టను ఖానాపూర్ మండలం మేడంపెల్లి అడవుల్లో గోదావరి నదికి అడ్డంగా అప్పటి నిజాం నవాబు కాలంలో 1881-82లో ఫ్రెంచ్ ఇంజనీర్ జేజే హోటాలే నిర్మించారు. ఈ ఆనకట్ట ద్వారా ఇప్పటికీ ఖానాపూర్, కడెం ప్రాంతాల్లో సుమారు 20 వేల ఎకరాల ఆయకట్టుకు సాగు నీరందుతోంది. కానీ ఏడు కిలోమీటర్ల ఎగువన బ్యారేజీ నిర్మాణంతో ఈ ప్రాంత రైతులు ఎన్నో అనుమానాలు రేకెత్తాయి. ప్రస్తుతం ప్రత్యేక కెనాల్ అంశంపై అటు ప్రభుత్వం, ఇటు ఎమ్మెల్యే సానుకూలంగా ఉండడంతో మళ్లీ సదర్మాట్ ఆనకట్టకు గత వైభవం వస్తుందని రైతులు సంతోషిస్తున్నారు.

రెండేళ్లలో పనులు ప్రారంభిస్తాం

ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు

ఖానాపూర్, కడెం ప్రాంతాల రైతుల కోరిక మేరకు సదర్మాట్ బ్యారేజీ నుంచి ఆనకట్ట వరకు ఖచ్చితంగా ప్రత్యేక కెనాల్ నిర్మించి తీరుతాం. ఇదివరకే అధికారుల నుంచి ప్రాథమిక అంచనా వివరాలను సేకరించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాను. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సదర్మాట్ ప్రత్యేక కెనాల్ నిర్మాణంపై సానుకూలంగా ఉన్నారు. ఈ వేసవిలో సర్వే నిర్వహించి కావాల్సిన అనుమతులను పొంది ఖచ్చితంగా రెండేళ్లలో ప్రత్యేక కెనాల్ పనులను ప్రారంభిస్తాం.



మేడంపెల్లి అడవుల్లో గల పురాతన సదర్మాట్ ఆనకట్ట (ఫైల్)



సదర్మాట్ ఆనకట్ట వద్ద నిండుగా కనిపిస్తున్న నీరు



సదర్మాట్ ఆనకట్టను పరిశీలిస్తున్న మంత్రి సీతక్క (ఫైల్)

కొనుగోళ్ల పర్వం



మార్కెట్‌ను ముంచెత్తుతున్న దిగుబడులు

భైంసా, ఫిబ్రవరి 19 : భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని గ్రెయిన్ మార్కెట్ యార్డును వ్యవసాయోత్పత్తులు ముంచెత్తుతున్నాయి. రోజుకు సరాసరి 300మందికి పైగా రైతులు ఇక్కడి మార్కెట్‌కు వ్యవసాయ దిగుబడులను విక్రయం కోసం తీసుకొస్తున్నారు. దీంతో యార్డు మొత్తం వ్యవసాయ దిగుబడులతో నిండిపోయి కనిపిస్తోంది. ప్రధానంగా సోయా, కందులు, శనగల దిగుబడులు అధిక మొత్తంలో అమ్మేందుకు రైతులు తీసుకవస్తున్నారు. సోమవారం స్థానిక మార్కెట్లో శనగలు క్వింటాలుకు సరాసరి ధర రూ.5913 ధరతో కొనుగోళ్లు జరిగాయి. ఇక మిగతా దిగుబడుల ధరలను పరిశీలిస్తే కందులు రూ.9823, సోయా రూ.4496, మొక్కజొన్న రూ.2229, జొన్న రూ.2666 ధరలతో కొనుగోళ్లు జరిగాయి. మొత్తమ్మీద భైంసా మార్కెట్ రైతులతో సందడిగా కనిపిస్తోంది.

జాతర సంబురం



రేపటినుంచి సమ్మక్క, సారలమ్మ జాతర

ముథోల్, ఫిబ్రవరి 19 : మండలంలోని ఎడ్‌బిడ్ తండా గుట్టలో గల సమ్మక్క, సారలమ్మ జాతర ఈ నెల 21 నుంచి ప్రారంభం కానుంది. ఈ జాతర బుధవారం నుంచి శనివారం వరకు జరగనుంది. గత 30 సంవత్సరాలుగా ఈ జాతరను అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నారు. బుధవారం కనకవనం గద్దె పైకి తెవడం.. సారలమ్మను దేవత గద్దెపైకి తీసుకు రావడం.. గురువారం శ్రీ సమ్మక్క దేవత గద్దె పైకి రావడం జరగనుంది. శుక్రవారం ఒడి బియ్యం, బోనాలు సమర్పించడం.. మొక్కుబడులు తీర్చుకోవడం.. శనివారం సమ్మక్క సారలమ్మ వనదేవతలు తిరిగి వన ప్రవేశం చేయుట జరుగుతుందన్నారు. ఈ జాతరకు జిల్లానుంచే కాకుండా నిజామాబాద్‌తో పాటు మహారాష్ట్ర నుంచి కూడా భక్తులు అధికంగా తరలొస్తారు.

ఆందోళన పథం



దాడికి పాల్పడ్డ వారిని శిక్షించాల్సిందే..

కుభీర్ , ఫిబ్రవరి 19 : మండల కేంద్రంలో ఈ నెల 15న రాత్రి జరిగిన ఘటనలో చౌహాన్ అవినాష్‌పై దాడి చేసిన ప్రధాన వ్యక్తులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం మండల గిరిజన నాయకులు పలు డిమాండ్‌లతో కూడిన వినతి పత్రాన్ని తహసీల్దార్ సోముకు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. దాడికి పాల్పడిన ప్రధాన వ్యక్తులను అరెస్టు చేయడం లేదని పోలీసులపై మండిపడ్డారు. పిటీషన్‌లో పేర్కొన్న వ్యక్తులందరినీ వెంటనే అదుపులోకి తీసుకొని, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అంతకు ముందు సంత్‌శ్రీసేవాలాల్ మహారాజ్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి ప్రధాన వీధుల గుండా ర్యాలీగా వచ్చి తహసీల్దారుకు వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రాథోడ్ శంకర్, వసంత్‌నాయక్, గులాబ్, కమ్లేష్, అజేయ్, గణపత్, తదితరులు పాల్గొన్నారు.

ఔదార్యం



విద్యార్థులకు కంప్యూటర్ల అందజేత

పెంబి, ఫిబ్రవరి 19 : మండలంలోని మందపల్లి గ్రామ కస్తూర్బా గాంధీ పాఠశాల విద్యార్థులకు సోమవారం సిమ్సన్ ఫార్మా లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ పెంచాల సత్యనారాయణరావు ఆధ్వర్యంలో విద్యార్థులకు కంప్యూటర్లను పంపిణీ చేశారు. అనంతరం కంప్యూటర్ ల్యాబ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నోబెల్ ఎడ్యుకేషనల్ ఎంపవర్మెంట్ సొసైటీ ద్వారా 10 కంప్యూటర్లు, 10 టేబుళ్లు, 20 కుర్చీలు, 10 యూపీఎస్‌లు, 10 హెడ్ ఫోన్స్, 1 టీవీ అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సత్యనారాయణ రావు, నోబెల్ ఎడ్యుకేషనల్ ఎంపవర్మెంట్ సొసైటీ సంస్థ అధినేత దంతూరి సురేష్ కుమార్, ఎంపీడీవో సుధాకర్ రెడ్డి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు వీణ, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి బీజేపీ యాత్ర

- బాసర నుంచి బీజేపీ విజయ సంకల్ప యాత్ర ప్రారంభం
- భైంసాలో బహిరంగ సభ
- అస్సాం సీఎం హిమంత రాక

భైంసా, ఫిబ్రవరి 19 : లోక్‌సభ ఎన్నికల సన్నద్ధతలో భాగంగా రాష్ట్ర బీజేపీ సంకల్పించిన విజయ సంకల్ప యాత్ర మంగళవారం నుంచి జిల్లాలో ప్రారంభం కానుంది. ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలోని మూడు జిల్లాల్లో.. నాలుగు రోజుల పాటు ఈ యాత్ర కొనసాగనుంది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో.. ముథోల్ నియోజకవర్గ పరిధిలోని చదువుల తల్లి కొలువైన బాసర నుంచి మంగళవారం ఈ యాత్రకు శ్రీకారం చుట్టనున్నారు. అమ్మవారి క్షేత్రంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం జిల్లాలో యాత్ర ప్రారంభం కానుంది. అక్కడి నుంచి యాత్ర భైంసాకు చేరుకోనుంది. ఇక్కడ సాయంత్రం వేళ భారీ బహిరంగ సభ జరగనుంది. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన అనంతరం తొలిసారిగా పార్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విజయ సంకల్ప యాత్రను బీజేపీ జిల్లా శ్రేణులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నాయి. ఇప్పటికే ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామారావ్ పాటిల్, పార్టీ జిల్లా అధ్యక్షులు అంజు కుమార్ రెడ్డిలు యాత్రను విజయవంతం చేసేందుకు చర్యలు చేపట్టారు. ముథో ల్ నియోజకవర్గం నుంచి 15వేలకు పైగా జనాన్ని సమీకరించే దిశగా చర్యలు చేపట్టారు.

ముఖ్య అతిథిగా రానున్న అస్సాం ముఖ్యమంత్రి

భైంసాలో బీజేపీ నిర్వహించే భారీ బహిరంగ సభకు అస్సాం ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వ శర్మ ముఖ్య అతిథిగా హాజరు కానున్నారు. ముఖ్యమంత్రి హిమంత్ ప్రత్యేక విమానంలో అస్సాం నుంచి మహారాష్ట్రలోని నాందేడ్ విమానాశ్రయం వరకు రానున్నారు. అక్కడి నుంచి భైంసాకు రోడ్డు మార్గంలో చేరుకోనున్నారు. బహిరంగ సభ ముగిసిన అనంతరం తిరుగు ప్రయాణం కానున్నారు. యాత్రలో రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఎంపీలు సోయం బాపురావ్, ధర్మపురి అరవింద్, నిర్మల్, ఆదిలాబాద్ ఎమ్మెల్యేలు ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పాయల శంకర్ ఇతర పార్టీ ప్రముఖులు పాల్గొననున్నారు.

బాసర నుంచి బైక్ ర్యాలీ

బాసర నుంచి ప్రారంభమయ్యే విజయ సంకల్ప యాత్రకు ముథోల్ ఎమ్మెల్యే పవార్ రామరావ్ పాటిల్ ఆధ్వర్యంలో బీజేపీ శ్రేణులు బైక్ ర్యాలీ ద్వారా స్వాగతం పలుకనున్నారు. నియోజక వర్గ పరిధిలో అన్ని ప్రాంతాల నుంచి 500కు పైగా బైక్‌లతో బాసర నుంచి భైంసా వరకు ర్యాలీ కొనసాగనుంది.

బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షించిన ఎస్పీ

బీజేపీ విజయ సంకల్ప యాత్రను పురస్కరించుకొని భైంసాలో అస్సాం ముఖ్యమంత్రి హిమంత్ బిశ్వ శర్మ ముఖ్య అతిథిగా హాజరయ్యే బహిరంగ సభకు చేపట్టాల్సిన బందోబస్తుపై జిల్లా ఎస్పీ జానకీ షర్మిల మంగళవారం సమీక్ష నిర్వహించారు. భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, టౌన్ సీఐ రాజారెడ్డిలతో కలిసి సభ జరిగే ఎస్ఎస్ జిన్నింగ్ ఫ్యాక్టరీ సభా స్థలిని పరిశీలించారు. భద్రతా చర్యలపై ఇక్కడకు వచ్చిన అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ సెక్యూరిటీ అధికారులతో చర్చించారు. అనంతరం భైంసా డివిజన్ పోలీసు అధికారులతో బందోబస్తు ఏర్పాట్లపై సమావేశం నిర్వహించారు.



భైంసాలో బందోబస్తు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎస్పీ జానకీ షర్మిల

ప్రజావాణికి వచ్చే సమస్యలను పరిష్కరించండి

అధికారులకు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆదేశం

నిర్మల్ కల్చరల్, ఫిబ్రవరి 19 : ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చే సమస్యలకు ప్రాధాన్యత ఇచ్చి సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ అర్జీదారుల నుంచి దరఖాస్తులను స్వీకరించి.. మాట్లాడారు. క్షేత్రస్థాయిలో పెండింగ్‌లో ఉన్న ఆయా శాఖల దరఖాస్తులను ఆరాతీసి ఆదేశించారు. ఆసరా పెన్షన్లు, ఉపాధి, విద్య, వైద్య రంగాలకు సంబంధించిన సమస్యలపై ప్రజలు దరఖాస్తులను అందించారు.

సేవాలాల్ జయంతి ఏర్పాట్లపై సూచనలు

సేవాలాల్ జయంతి ఈ నెల 21న ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. బంజారా కమిటీ సభ్యులతో సమావేశమై ఏర్పాట్లపై చర్చించారు. అన్ని శాఖలు సమన్వయంతో సేవాలాల్ 285 జయంతి వేడుకలకు ఏర్పాట్లు సాంప్రదాయ పద్ధతిన చేయాలని సూచించారు. తాగునీరు, భోజనం, వైద్య తదితర ఏర్పాట్లను చేయాలన్నారు.

ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై సమీక్ష

ఈ నెల 28 నుంచి జరిగే ఇంటర్ పరీక్షల నిర్వహణపై కలెక్టర్ అధికారులతో సమీక్ష జరిపారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు, కేంద్రాల ఏర్పాటు సౌకర్యాలపై చర్చించారు. 23 కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు పరీక్షలకు సకాలంలో హాజరయ్యేలా బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరా, ఫర్నిచర్, వైద్య సిబ్బంది అందుబాటులో ఉంచడం గట్టి పోలీసు బందోబస్తుపై ఆదేశాలిచ్చారు. అదనపు కలెక్టర్లు కిషోర్ కుమార్, ఫైజాన్ అహ్మద్, ఆర్డీవో రత్న కళ్యాణి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.